# పెళ్లి కుదిరింది

-దానం ఉమాదేవి

"మన భార్గవి వాళ్లకు నచ్చిందిట. ఇప్పుడే ఫోన్ చేసారు" సెల్ ఫోన్ జేబులో పెట్టుకుంటూ తల్లితో, భార్యతో చెప్పాడు ప్రభాకర్.

"కుందనపుబొమ్మలాంటి నా మనవరాలు ఎవరికైనా నచ్చుతుంది" మురిపెంగా భార్గవిని చూస్తూ చెప్పింది సావిత్రమ్మ.

"వాళ్లు ఎంతలో వున్నారో ఏమో" అంటూ సందేహం వ్యక్తం చేసిన భార్య వందనవైపు సాలోచనగా చూసాడు ప్రభాకర్.

అతడూ అదే ఆలోచిస్తున్నాడు. వాళ్లు అందుబాటులో ఉంటారో ఉండరో?

"మగపిల్లలకు సరిపడా ఆడపిల్లలు లేరని టీవీలో చెబుతుంటే వినరేం? కట్నాలు ఎవ్వరూ అడగరు. పిల్ల దొరికితే చాలనుకుంటారు. మహా అడిగితే లక్ష. అంతకుమించి ఏమీ ఉండదు" కొడుక్కి భరోసా ఇచ్చింది సావిత్రమ్మ.

"అనుకున్నట్లే జరిగితే అంతకన్నా కావల్సిందేముంది" వందన అందించిన కాఫీగ్లాసు అందుకుంటూ చెప్పాడు ప్రభాకర్.

ప్రభాకర్ చిరుద్యోగి. అతనికి ఇద్దరు పిల్లలు. భార్గవి ఎమ్ఎస్సి పాసై ఉద్యోగాన్వేషణలో ఉన్నది. కొడుకు లోహిత్ బిఎస్సి సెకండియర్ చదువుతున్నాడు. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ప్రశాంత్ తన తల్లిదండ్రులతో కలసి వారం క్రిందట భార్గవిని పెళ్లిచూపులు చూసి వెళ్లారు.

"వాళ్లు మన సంబంధం నచ్చిందని చెప్పారు. అబ్బాయి నీకు నచ్చాడా?" కూతుర్ని అడిగాడు ప్రభాకర్.

"దాని మొహం. దానికేం తెలుసు. పిల్లవాడు బ్రహ్మాండంగా ఉన్నాడు" అంటున్న తల్లి మాటలకు అడ్డం వచ్చాడు ప్రభాకర్.

"నచ్చాల్సింది నీకు కాదు నా కూతురికి. అమ్మాయికి నచ్చితేనే అడుగు ముందుకేసేది."

తనకీ సంబంధం ఇష్టమేనన్నట్లు తల ఊపింది భార్గవి.

స్టైలిష్‌గా ఉండే ప్రశాంత్ భార్గవిని ఎంతగానో ఆకట్టుకున్నాడు. తాను అతడికి నచ్చిందో లేదోనని సందేహపడింది. ఫోన్ రింగవడం ఆలస్యం పెండ్లి వాళ్లేనేమోనని ఆరాటపడేది. తాను నచ్చానని చెప్పగానే ఆమె మనసు తేలికైంది.

"రేపు ఆదివారమేకదా. రేపు వెళ్లి వాళ్లతో మాట్లాడతాను" అన్నాడు ప్రభాకర్.

"రేపు నవమి మంచిదికాదు. ఎల్లుండి దశమి. ఆ రోజు వెళ్లు" కొడుకుతో చెప్పింది సావిత్రమ్మ.

"ప్రతి దానికీ మంచిరోజంటే ఎలా? సెలవులు ఉండవద్దూ"

"మంచిరోజు చూసుకుంటే కాని పని కూడా అవుతుంది" అత్తగారికి సపోర్ట్‌గా చెప్పింది వందన.

దశమిరోజు వస్తానని పెళ్లివాళ్లకు ఫోన్ చేసి చెప్పాడు ప్రభాకర్. ప్రశాంత్ తల్లిదండ్రులు హైదరాబాద్‌కు దగ్గర్లోని టౌన్‌లో ఉంటారు.

★★★

అనుకున్నరోజుకు ప్రభాకర్ దంపతులు, బావమరిది హరి బయలుదేరారు. ముగ్గురు వెళితే ముడిపడదని నలుగురు వెళ్లాలని తల్లి చెప్పడంతో ఫ్రెండ్ మురళిని కూడా తీసుకెళ్లాడు.

పెళ్లికొడుకు తల్లిదండ్రులతోపాటు మరో నలుగురు దగ్గరి బంధువులున్నారు వీళ్లు వెళ్లేటప్పటికి. టీ, వగైరా మర్యాదలు అయిపోయాయి. కట్నకానుకల విషయం ప్రభాకరే ముందుగా ప్రస్తావిస్తాడని మగపెళ్లివారు, పెళ్లివాళ్లకు కట్నం తీసుకునే ఉద్దేశ్యం ఉందో లేదో ముందుగా తాను ప్రస్తావించడం ఎందుకని ప్రభాకర్ కాసేపు మిన్నకుండిపోయారు. కాలక్షేపం కబుర్లు సాగిపోతున్నాయి. కానీ అసలు విషయం ప్రస్తావనకు రావడంలేదు. రెండునెలలదాకా వివాహ ముహూర్తాలు లేవన్న విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. చివరికి ఉండబట్టలేక పెళ్లికుమారుడి తల్లి తులశమ్మ మొదలుపెట్టింది.

"కట్న కానుకల విషయం మాట్లాడుకున్న తరువాత ముహూర్తాల గురించి ఆలోచించవచ్చు."

"లక్ష రూపాయలు కట్నంగా ఇచ్చి నాకు చేతనైనంతలో బాగానే పెళ్లి చేస్తాను" చెప్పాడు ప్రభాకర్.

"ఉద్యోగం సద్యోగం లేనివాడే లక్ష తీసుకుంటున్నాడు. మావాడు నెలకు ముప్పైవేలు సంపాదిస్తున్నాడు" కాస్త విసుగ్గానే అన్నాడు పెళ్లికొడుకు తండ్రి జగన్నాథం.

"లక్షన్నరకు మించి నావల్లకాదు" తేల్చేసాడు ప్రభాకర్.

"నాలుగు లక్షలు ఇస్తామని చెప్పిన సంబంధమే మేము వదులుకున్నాం"

ప్రభాకర్ ఏమీ మాట్లాడలేకపోయాడు. వందనకు ఈ సంబంధం వదులుకోవడం ఇష్టంలేదు.

"రెండులక్షలు ఇస్తామని చెబుదాం" భర్త చెవిలో గుసగుసలాడింది.

"నాలుగు లక్షలిస్తామన్న సంబంధాలే వదులుకున్నవారు రెండుకు ఒప్పుకుంటారా?" సందేహంగా అక్కని అడిగాడు హరి.

"చూద్దాం" అంటూ తమ ప్రపోజల్ పెళ్లి

వాళ్ల ముందు ఉంచాడు ప్రభాకర్.

"ఇదేమన్నా కూరగాయల బేరమా?" అంటూ విసుక్కున్న తులసమ్మ తమ డిమాండ్స్ అన్నీ ఏకరువు పెట్టింది.

ఐదులక్షల కట్నం, రెండులక్షలకు బంగారం, పెళ్లి గ్రాండ్‌గా చేయాలి.

రెండులక్షలు క్యాష్, ఒక లక్షకు బంగారం పెట్టడానికి ఒప్పుకున్నాడు ప్రభాకర్. అది కూడా వందన బలవంతం మీదనే.

"కట్నం ఒక లక్ష తగ్గిస్తాం అంతే. మిగతావన్నీ చెప్పినట్లు జరగాల్సిందే. మీరు ఊ అంటే మంచిరోజు చూసి ముహూర్తాలు పెట్టుకుందాం" అన్న జగన్నాధం మాటలకు ఔననలేదు, కాదనలేదు ప్రభాకర్.

మౌనం అంగీకారమన్నట్లుగా భావించింది తులసమ్మ.

అరగంట తరువాత వస్తామంటూ బయలుదేరిన ఆడపెళ్లివారిని గుమ్మందాకా సాగనంపారు తులసమ్మ అండ్ కో. అక్కడి నుండి ప్రభాకర్ ఊరికి మూడుగంటల ప్రయాణం.


"మరీ ఆశపోతుల్లా ఉన్నారు " అన్నాడు ప్రభాకర్ ఫ్రెండ్.

ఇంటికి చేరగానే గుమ్మంలోనే ఎదురొచ్చింది సావిత్రమ్మ.

"ఏమైంది వెళ్లిన విషయం?" అడగ్గానే జరిగింది మొత్తం పూస గుచ్చినట్ల చెప్పింది వందన.

"ఈడూజోడూ బాగున్నారు. కుదిరితే బావుంటుందని ఆశపడ్డాను. పోనీ నా చంద్రహారం, మూడు జతల గాజులు అమ్మితే అడిగినంత కాకపోయినా మనం కూడా ఇంకొంచెం ఎక్కువ కట్నం ఇవ్వవచ్చు" అంటున్న సావిత్రమ్మ మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చింది భార్గవి.

"మన స్థోమతకు మించి వెళ్లాల్సిన అవసరం లేదు. నాకీ సంబంధం నచ్చలేదు"



"కుర్రాడు బుద్ధిమంతుడిలా ఉన్నాడు. పైగా నేను తిరుగుతున్నప్పుడే నీ పెళ్లయితే తరువాత జరిగే నీ పురుళ్లు, పుణ్యాలకు కాస్త పెద్ద దిక్కుం టాను''

"నేను సంవత్సరం దాకా చేసుకోనంతే. వాళ్లను రమ్మన్న తరువాత మానుకుంటే బాగుండదని నన్ను ఒప్పించారు. ఎలాగూ ఇది కుదరలేదు కాబట్టి ఇప్పట్లో నా పెళ్లి విషయం ఎత్తకండి. ముందు నాకు జాబ్ కావాలి.''

"అది కాదే''

"గుండ్రాయిలా వున్న నువ్వు ఇప్పట్లో మూలన పడవు. మా పిల్లల పెళ్లిళ్లు చేసేదాకా కూడా నువ్వు ఇలాగే ఉంటావు'' అన్నది భార్గవి బామ్మ బుగ్గపట్టి లాగుతూ.


"తరువాత ఆలోచిద్దాం. పెళ్లి గురించిన ముచ్చట్లు ప్రస్తుతం వదిలే యండి'' అంటూ లేచాడు ప్రభాకర్.

తరువాత కూతురుకు నిదానంగా చెప్పవచ్చుననుకున్నాడు మనసులో.



## ఆశిన్ స్టయిల్

ఇటీవల బాలీవుడ్‌లో విజయపతాకాన్ని ఎగరేసినా అంతగా అక్కడ అవకా శాల్లేక కాస్త డీలాపడిన అశిన్‌కి ఒక్కసారిగా ఉత్సాహం కలిగించేలా ఓ అవార్డు వచ్చింది ఈమధ్య. కేరళలోని ఓ సంస్థ ఓటింగ్ ద్వారా 'యూత్ ఐకాన్ ఆఫ్ కేరళ' అని అశిన్‌ని ఎంపిక చేసి ఓ సభలో అవార్డు ప్రదానం కూడా చేసారు. ఆ సందర్భంగా తనకి అవార్డుకింద వచ్చిన నగదు బహు మతిని ఓ ఆసుపత్రి అభివృద్ధి కోసం విరాళంగా ఇచ్చేసిందిట అశిన్. ఎంత యినా అశిన్ స్టయిలే వేరు!




"నీ సొమ్మంతా దానికే ఖర్చు పెడితే మరి మా ఆవిడకేమిస్తావే బామ్మా. ముందు నీ సొమ్ము పంపిణీ తేలితేనే దాని పెళ్లి''

మోహన్‌బాబు అనుకరిస్తూ లోహిత్ చెప్పిన డైలాగులకు సావిత్రమ్మతో సహా అందరూ గొల్లున నవ్వారు.

***

"ఇంతకూ మనమడిగిన కట్నానికి వాళ్లు ఒప్పుకున్నట్లా లేదా?'' సందే హంగా భార్యను అడిగాడు జగన్నాథం.

"ఇవ్వలేమని గట్టిగా ఏమీ చెప్పలేదుకదా. పైగా వెళ్లేటప్పుడు వస్తానని చెప్పే వెళ్లారు. అంటే మన డిమాండ్స్‌కు ఒప్పుకున్నట్లే'' విశ్లేషించింది తుల సమ్మ. కొడుక్కి ఫోన్ చేసి సంబంధం ఖాయం చేసుకున్నామని చెప్పింది.

చూసి వచ్చిన సంబంధం ఏమైందంటూ అడిగిన బంధువులకు, ఇరుగు పొరుగు వారికి త్వరలోనే కొడుకు పెళ్లని చెప్పారు.

"పోయిన నెలలో మీ బాబాయి కూతురు లక్ష కట్నమిస్తామని వచ్చింది. అదేదో గొప్పయినట్లు'' అన్నది తులసమ్మ.

"మీ అన్నయ్య మటుకు రాలేదా లక్షన్నర ఇస్తానని పెద్ద దానకర్ణుడిలా ఫోజు పెట్టి'' మధ్యలోనే అందుకున్నాడు జగన్నాథం.

కాసేపు భార్యాభర్తలు అప్పటిదాకా వచ్చిన సంబంధాల గురించి, వాళ్లి స్తామన్న కట్నకానుకల గురించి ముచ్చటించుకున్నారు.

***

రోజులు గడుస్తున్నా ప్రభాకర్ దగ్గర్నుంచి ముహూర్తాలు పెట్టుకుందాం రమ్మన్న కబురు రాకపోవడంతో ఆలోచనలో పడ్డాడు జగన్నాథం.

"వచ్చేవారం నుండి వరుసగా ముహూర్తాలున్నాయి. ఇంతవరకూ వాళ్లు మళ్లీ ఫోన్ చేయలేదు. వేరే సంబంధం చూసుకున్నారా?''

భార్య దగ్గర సందేహం వ్యక్తం చేసాడు.

"రెండురోజుల్లో ఫోన్ వస్తుందని నా నమ్మకం'' అన్నది తులసమ్మ.

వారం గడిచినా ఫోన్ రాకపోవడంతో తానే ఫోన్ చేసాడు జగన్నాథం.

"మీరడిగినంత కట్నం ఇచ్చుకునే స్తోమత నాకు లేదు. మేము వేరే సంబంధాలు చూస్తున్నాము'' అని చెప్పి ప్రభాకర్ ఫోన్ చేయడంతో ఖంగుతిన్నారు తులసమ్మ దంపతులు.

"ఈ విషయం ముందే చెప్పవచ్చుగా. అనవసరంగా అందరికీ పెళ్లి కుదిరిందని చెప్పాం. ఇప్పుడు సంబంధం తప్పిపోయిందని తెలిస్తే మన లోనే లోపముందని అనుకుంటారేమో'' భార్య దగ్గర సందేహం వ్యక్తం చేసాడు జగన్నాథం.

"అమ్మాయి ప్రవర్తన సక్రమంగా లేదని తెలియడంతో మనమే సంబంధం వదులుకున్నామని చెబితే సరి'' తన తెలివితేటలు ప్రదర్శిం చింది తులసమ్మ.

"వాళ్ల కుటుంబం మంచిదని అందరికీ తెలుసు. వేరే ఏదైనా చెప్పాలి''

తులసమ్మ కొడుక్కి ఫోన్ చేసి విషయం చెప్పింది. ప్రశాంత్ తల్లిపై ఇంతెత్తున ఎగిరాడు.

"వాళ్ల అభిప్రాయం తెలుసుకోకుండానే పెళ్లికి ఒప్పుకున్నారని ఎందుకు చెప్పారు. నేను ఆఫీసులో అందరికీ చెప్పాను. ఇప్పుడు ఈ విషయం తెలిస్తే పరువు పోతుంది. నాకా అమ్మాయి బాగా నచ్చింది. మీకు ముందే చెప్పానుకదా. వాళ్లిచ్చింది తీసుకోవడమేగానీ ఇంతివ్వమని వత్తిడి చేయవద్దని...''

తాను ఆ పిల్లనే చేసుకుంటానని కొడుకు పట్టుపట్టడంతో తులసమ్మ దిగి రాక తప్పలేదు.

మళ్లీ ప్రభాకర్‌కు ఫోన్ చేసాడు జగన్నాథం. సెల్ ఇంట్లోనే మర్చిపోయి ప్రభాకర్ వెళ్లిపోవడంతో వందన కాల్ రిసీవ్ చేసుకుంది.

"నేను జగన్నాథాన్ని మాట్లాడుతున్నాను..." అంటూ ఇంకా ఏదో చెప్ప బోతుండగా మధ్యలోనే అడ్డం వచ్చింది వందన.

"మేము వేరే సంబంధం చూసుకుంటున్నాం"

"అమ్మాయి... ఒక్క నిముషం" అంటున్నాడు జగన్నాథం.

ఫోన్ ఎక్కడినుండో సావిత్రమ్మకు అర్థమై కోడలి చేతిలోని సెల్ తీసుకుంది.

"కోట్లు ఇచ్చే సంబంధాలు చూసుకోండి. మా అభిప్రాయం చెప్పాం కదా. ఎందుకు మమ్మల్ని విసిగిస్తారు"

ఏం మాట్లాడాలో అర్థం కాని జగన్నాథం ఫోన్ భార్యకిచ్చాడు.

"కట్నందేముంది పిన్నిగారూ! మీ సంబంధం నచ్చింది. అందుకే మేము తగ్గుతున్నాం. పెళ్లి మాత్రం చాలా గ్రాండ్‌గా చేయాలి. అబ్బాయి బట్టలకు ముప్పైవేలు ఇవ్వండి. అత్తగారి చీర మాత్రం పదివేలకు తగ్గకూడదు."

సావిత్రమ్మలో ఒకపక్క ఆనందం... మరోపక్క కొడుకు ఏమంటాడో నన్న భయం. కొడుకు ఇస్తానన్నంత వరకు ఇవ్వడానికే చాలా ఇబ్బంది పడాలి. ఆపై పెళ్లి ఖర్చు. ఇంకా బట్టలూ, లాంఛనాలు అంటున్నారు. ప్రభాకర్ వల్లకాదని ఆమెకు తెలుసు.

"ఇంతకుముందు ఇస్తామన్న కట్నకానుకలు కూడా మేమివ్వలేం. రావాల్సిన సొమ్ము రాలేదు. మీరు వేరే సంబంధం చూసుకోండి" అంటూ సెల్ ఆఫ్ చేసింది సావిత్రమ్మ.

తులసమ్మ బిత్తరపోయింది. తాను చెప్పింది విని కట్నం తగ్గించినందుకు ఎగిరి గంతేస్తారనుకుంది. కానీ ఇలాంటి సమాధానం ఊహించలేదు. ఇటు చూస్తే కొడుకు తానొక్కడే వెళ్లి పెళ్లి చేసుకునే వచ్చేలా ఉన్నాడు.

పెళ్లివాళ్లు మెట్టు దిగివచ్చిన సంగతి అత్తగారిద్వారా తెలుసుకున్న వందన ఆనందపడింది. పెళ్లికి ఒప్పుకుంటే...

"ఏమిటి ఒప్పుకునేది. కట్నం తగ్గించి ఆమేరకు బట్టలు, లాంఛనాలు అంటూ వేరే రూపంలో వసూలు చేస్తున్నారు. పెళ్లి చాలా గ్రాండ్‌గా చేయాలట" అన్నది సావిత్రమ్మ.

"కానీ పిల్లవాడు బాగున్నారత్తయ్యా"

"పిచ్చిదానా నాకూ ఈ సంబంధం ఇష్టమే. అంత అడిగినవాళ్లు మనమిస్తామన్న దానికి దిగివచ్చారంటే అది పిల్లగాడి పట్టుదల అయి వుంటుంది. మన పిల్ల అంతగా నచ్చింది. మరి నా అభిప్రాయం కరెక్టయితే వాళ్లు మళ్లీ ఫోన్ చేయాలి. లేకపోతే ప్రభాకర్ వచ్చిన తరువాత వాడితో అన్ని విషయాలూ చెప్పి ఆలోచిద్దాం."

సావిత్రమ్మ మాట్లాడుతూ ఉండగానే మళ్లీ సెల్ మోగింది.

వందన నెంబర్ చూసింది. అది పెళ్లివాళ్లదే. మీరు చెప్పిందే కరెక్టే అని సైగ చేస్తూ సెల్ అత్తగారికి అందించింది.

"మీ అమ్మాయి మావాడికి నచ్చింది. అందుకే మేము ఇన్నిసార్లు ఫోన్ చేస్తున్నాం. మీకు చేతనైనంతే ఇవ్వండి. పెళ్లి మాత్రం బాగా..."

"ఇప్పుడు చేతిలో పెద్దగా డబ్బులేదు. అమ్మాయికి పది సవర్ల బంగారం పెట్టగలం. తరువాత వాళ్ల సంసారానికి కావాల్సిన వస్తువులు కొన్ని కొనివ్వగలం. పెళ్లి మాకు చేతనైనంతలో చేస్తాం. మీకిష్టమైతే వచ్చే గురువారం పంచమినాడు లాంబూలాలకు రండి."

లోపలి గదిలో కూర్చుని టీవీ చూస్తున్న భార్గవి అన్నీ వింటూనే వుంది. ప్రశాంత్ ఆమెకు బాగా నచ్చాడు. కట్నకానుకలు దగ్గర తేడా రావడంతో అతడిని మనసులో నుండి తుడిచేసుకుంది. వాళ్లే మళ్లీ ఫోన్ చేయడంతో భార్గవిలో ఆసక్తి పెరిగింది. అటునుండి వచ్చే సమాధానం కోసం చెవులు రిక్కించింది.


తాము ఒక్కో మెట్టు దిగేకొలదీ ఆడపెళ్లివాళ్లు ఒక్కో మెట్టు ఎక్కుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయత తులసమ్మది. వాళ్లు అసలు ఏమీ ఇవ్వమన్నా పెళ్లి కూడా చేయలేమన్నా కొడుకు కోసం ఒప్పుకోవాల్సిందే. మొదటే వాళ్లిస్తామన్న దానికి ఒప్పుకుంటే బాగుండేది.

అంతలోనే మళ్లీ సంతోషం. నయం కాస్త బంగారం పెట్టి పెళ్లన్నా చేస్తామన్నారు. లేదంటే ఆ ఖర్చు కూడా తామే పెట్టుకోవాల్సి వచ్చేది.

"సరేనండీ... గురువారం పదింటికల్లా మీ ఇంట్లో ఉంటాం. వచ్చేనెల మూడోతేదీన మంచి పెళ్లి ముహూర్తం ఉంది. దానికి రెడీగా ఉండండి" అంటూ ఫోన్ పెట్టేసింది తులసమ్మ.

బామ్మ మొహంలో సంతోషం చూడగానే అట్నుండి వచ్చిన సమాధానం ఊహించిన భార్గవి సిగ్గుల మొగ్గ అయింది.

★



## స్పైడర్‌మాన్

ఎలియన్ రాబర్ట్స్ ఎత్తయిన టవర్లని అవలీలగా ఎక్కేస్తున్న ప్రపంచ ప్రసిద్ధ స్పైడర్‌మాన్ అని తెలిసిందే. ఇటీవల అతను మన దేశం వచ్చినప్పుడు పుణెలోని అమనోరా పార్క్ టౌన్‌లోని 20 అంతస్థుల టవర్‌ని 8 నిముషాల్లో ఎక్కేసి అందరిచేతా శభాష్ అనిపించుకున్నాడు. ఆ తరువాత తన ఫిట్‌నెస్, విజయాల గురించి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడాడు.

-తటవర్తి

